క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రాయచూరు శివాచార్య స్వామి రానున్నట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. ఈ మేరకు శివాచార్యస్వామికి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 19నుంచి జరిగే మహా శక్తివంతమైన కాలభైరవ పాశుపత హోమాలు నిర్వహిస్తామని, స్వామి భక్తులను ఆశీర్వదించి రక్ష కంకణాలు అందజేస్తారని తెలిపారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

జోరుగా వంతెన నిర్మాణం



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల, కాశీంనగర్ మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని రేమద్దుల నుంచి వనపర్తి మండలం కాశీంనగర్ వరకు 4.83 కిలోమీటర్ల పీఆర్ బీటీ రోడ్డు నిర్మాణం, బ్రిడ్జికి కలిపి రూ.2.86 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే గ్రామంలో పెద్ద మురుగు నీటి కాల్వ ఉంది. ఆ కాల్వపై బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి చేసి రోడ్డు నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు కాంట్రాక్టర్ కిషన్‌నాయక్ పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా పరంగా ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయి.

సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 3వ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచరు మంజులరాణి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీఓ రాజు హాజరై వర్మీ కంపోస్ట్ తయారు చేయు విధానం గూర్చి తల్లులకు వివరించారు. తడి, పొడి చెత్త తయారు చేయు విధానాన్ని చూపించారు. ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిశోర్, అంగన్‌వాడీ టీచరు మంజులరాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాఠశాలల పనుల పురోగతిపై సమీక్ష



కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విద్యాశాఖకు సంబంధించి మండల స్థాయి సమీక్ష సమావేశం బుధవారం వారం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీఓ పట్టాభిరామారావు, ఎంఈఓ ఎస్.చంద్రుడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పాటు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతు, నీటి వసతులు, విద్యుత్ సదుపాయం, టాయిలెట్ల నిర్మాణాలకు గురించి అడిగి తెలుసుకున్నారు. జూన్ 12 వతేదీ లోపు ఆయా పనులను పూర్తిచేసేలా పాఠశాల కమిటీలు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం

మానవపాడు: మండలంలోని శ్రీ గంగా వెంకటకృష్ణారెడ్డి ప్రభుత్వ మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు అధ్యాపకులు వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కళాశాల సిబ్బందితో కలిసి పర్యటించి విద్యార్థులకు కళాశాల ప్రవేశాలపై అవగాహన కల్పించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశం పొందే విద్యార్థులు కళాశాలలో సంప్రదించి వెంటనే తమ అడ్మిషన్‌ను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.





కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో..



పాన్‌గల్ మండలంలోని అన్నారంలో మొక్కలు నాటుతున్న అధికారులు



పెబ్బేరు మండలంలోని జనుంపల్లి శివారులో..

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మదనాపురం మండలంలోని తిర్మలాయపల్లిలో మొక్కలు నాడుతున్న సీడీపీఓ భారతి

అమరచింత: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండలంలోని కొంకన్‌వానిపల్లిలో అమృత్ సరోవర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ గ్రామ శివారులోని చెరువులో వర్షపునీరు సమృద్ధిగా చేరేందుకు రైతులు, గ్రామ ప్రజలు కృషి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో పూడికతీత పనులతో పాటు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు లేకుండా పనులు చేయిస్తున్నామన్నారు. వర్షపు నీరు నేరుగా చెరువులోకి వెళితే పంట పొలాలతో పాటు భూగర్భ జలాలు పెరుగుతుందని అవగాహన కల్పించారు.

కొత్తకోట రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డాక్టర్ ఆసియా బేగం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఆసియాబేగం, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియాబేగం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. పర్యావరణ ముప్పుతో అన్ని జీవరాశులు, మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో విధిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నందకిషోర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఏపీఓ కుర్మయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని అన్నారం, చింతకుంట, దావాత్‌ఖాన్‌పల్లి, గోప్లాపూర్ గ్రామాల్లోని అమృత్ సరోవర్ కార్యక్రమంలో చేపట్టిన చెరువులు, కుంటల పరిసరాలల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఈసీ అంజన్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వీపనగండ్ల: మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామని మండల వైద్యాధికారి డా.రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: పర్యావరణం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ ఆత్మకూర్ ప్రాజెక్టు అధికారి భారతి సూచించారు. తిర్మలాయపల్లి మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ నర్మద, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కొడాలి, అనిత, భవాని కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు వృథా చేయకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పెబ్బేరు ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జనుంపల్లి, అయ్యవారిపల్లి, గుమ్మడం, కంచిరావుపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యమ్మ, స్వరూపరాణి, రాజశేఖర్, తిరుపతయ్య, రాజేష్‌గౌడ్, కుమారి, వెంకటమ్మ, శారద, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.



వీపనగండ్ల పీహెచ్‌సీ ఆవరణలో..



అమరచింత మండలంలోని కొంకన్‌వానిపల్లిలో..



పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

రోడ్డుపై కూలిన చెట్టు



లక్ష్మీపురం వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

మదనాపురం: మండలంలోని లక్ష్మీపురం వద్ద ఊక చెట్టు వాగు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఒరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ఉదయం నుంచి వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సంబంధిత ఆర్ అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. కనీసం రాత్రి వరకు చెట్టును తొలగించే ప్రయత్నం కూడ చేయలేదు. రాత్రి వేళలో కొత్త వ్యక్తులు వాహనాలపై వెళ్తే గుర్తించడం కష్టంగా ఉంది. అధికారుల తీరు ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ఈ రూట్లో ప్రయాణిస్తూ ఉంటాయి. సంబంధిత అధికారులు తక్షణమే రోడ్డుకు అడ్డగా ఉన్న చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



వీపనగండ్లలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్



గోపాల్‌పేటలో..

వీపనగండ్ల: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించడం వల్ల వారికి విద్యాదానం చేసిన వాళ్లం అవుతామని ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. జూన్ 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్లు, సీఆర్పీలు, సమైక్య సీసీలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం బడి బాటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు ఎంపీడీఓ, ఎంపీఈఓ, ఎంఈఓ సమక్షంలో ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్లు, పంచాయతీ సెక్రెటరీలకు అవగాహన కల్పించారు. బడిబాట కార్యక్రమంలో విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం జూన్ ఆరో తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతి గ్రామంలోని కాలనీల్లో సందర్శించి బడిఈడు పిల్లలను బడిలో చేరే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను గురించి పూర్తిగా వివరించాలని సూచించారు. నోట్‌బుక్స్, పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్నం భోజనం, మొదలైన ఉచిత సౌకర్యాలు ఉన్నాయని వారివారి తల్లిదండ్రులకు చెప్పాలన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

పెబ్బేరు రూరల్: పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులపై అనేక రకాల పని ఒత్తిడికి గురిచేసిందన్నారు. ఆర్టిజన్ రెగ్యులర్ చేస్తామని చెప్పి చేయలేదన్నారు, సబ్ స్టేషన్ నిర్మాణానికి భూములను ఇచ్చిన వారికి శాశ్వత ఉద్యోగం ఇస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదని మండిపడ్డారు. అదేవిధంగా ఆర్టిజన్స్‌గా గుర్తించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం కారణం వలన నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, ఈశ్వర్, మోహన్, ఎండీ మస్తాన్, బాలరాజు, నర్సింహ, వివేక్, చాణక్య తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నంబావి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని, 40వేల ఓట్ల మెజార్టీని ప్రజలు అందించారన్నారు. తన రాజకీయ స్వలాభం కోసం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ నాయకులను విమర్శిన్నారని దుయ్యబట్టారు. మండలంలోని లక్ష్మీపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త హత్యకు గురైతే దానిని చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులని, దాంట్లో జూపల్లి హస్తం ఉందనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదేవిధంగా లక్ష్మీపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణప్రసాద్‌ను విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కృష్ణప్రసాద్‌యాదవ్ విచరణకు సహకరిస్తున్నారని, ఆయన స్థానికంగానే ఉంటున్నారని ఎక్కడికి పారిపోలేదన్నారు. అదేవిధంగా మండల నాయకులు బీచుపల్లియాదవ్ శ్రీధర్‌రెడ్డికి ఎవరితో శతృత్వం లేదని, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని విచారిస్తే అసలు నిందితులు ఎవరో తేలుతుందని తెలిపారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్, సురేందర్‌సింగ్, తేజారెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న, ఎంపీటీసీ మహదేవ్‌గౌడ్, గూడెం సుధాకర్, జ్యోతి గౌడ్, ఆంజనేయులు, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన విద్యార్థులు



నాగేశ్వరి



సాయినివాస్



పి.కీర్తి



వాజిహా ఇరం



అక్షయ



భవిత

అమరచింత: నీట్ పరీక్ష ఫలితాల్లో అమరచింతకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన నరాల సిద్ధు రాములు కుమార్తె నరాల భవిత 720 మార్కులకు గాను 511 మార్కులు, రేవుల వెంకటేష్ కుమార్తె అక్షయ 518 మార్కులు, పోసిరిగారి శ్రీనివాస్ కుమార్తె 536 మార్కులు, మేస్త్రీ సురేష్ కుమార్తె దేవర్ల నాగేశ్వరి 460 మార్కులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ మనుమరాలు వాజిహా ఇరం 562 మార్కులు సాధించారు. పట్టణానికి చెందిన విద్యార్థినులు నీట్‌లో ప్రతిభ చూపడం గర్వకారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన సాయినివాస్ నీట్ యూజీ ఫలితాల్లో 720 మార్కులకు గాను 502 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ ఎనుముల రాములు, కవిత దంపతుల కుమారుడు నీట్‌లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

గోపాల్‌పేట: మండల కేంద్రంలో నాలుగు ఇసుక ట్రాక్టర్లు, ఒక జేసీబీని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రం నుంచి చెన్నూరుకు వెళ్లే బాటలో ఉన్న వాగులో బుధవారం ఇసుక ఫిల్టర్ చేసి ఇతర గ్రామాలకు అమ్ముకుంటున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి చూడగా నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీ సాయంతో ఇసుక ఫిల్టర్ చేస్తూ కనిపించారు. వెంటనే వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక దందా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

అమరచింత: ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సంగెపాగు దాసును నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సమక్షంలో కార్మిక సంఘం నాయకుడిగా దాసు నియామకపత్రం అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా దాసు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష పదవి ఇచ్చిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి బ్రెయిన్ సర్జరీతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి నుంచి వెళ్తున్న 33 కేవీ, ఇర్కిచేడు, నందిన్నె, సిద్దన్‌పల్లి, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎర్సందొడ్డి, సుల్తాన్‌పురం, కుచినెర్ల, కేటీదొడ్డి, గ్రామాల్లో వర్షాకాలం ముందు చేయాల్సిన విద్యుత్ లైన్లు మరమ్మతు, కొత్తలైన్ వేయడం, చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 'ఖిల్లా' విద్యార్థులు



హన్మకొండకు బయలుదేరుతున్న విద్యార్థులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఖిల్లాఘనపురం మండల విద్యార్థులు ఎంపికైనట్లు సీనియర్ క్రీడాకారులు యాదయ్య, దేవేందర్ తెలిపారు. అర్చన, స్వాతి 400 మీటర్ల పరుగు పందెం, అఖిల్, తేజ, సింధు, స్వప్న 100 మీటర్ల పరుగు పందెం, ఈశ్వర్, నాగచైతన్య 80 మీటర్ల పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో ఈ నెల 3న జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులు వరంగల్‌లోని హన్మకొండలో గురు, శుక్రవారాల్లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు బుధవారం వరంగల్‌కు బయలుదేరారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను మండల ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ప్రజా హక్కుల రక్షణే సీపీఎం ధ్యేయం

కొల్లాపూర్ రూరల్: ప్రజా హక్కుల పరిరక్షణే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ అన్నారు. బుధవారం మండలంలోని సింగోటం గ్రామ సమీపంలో శ్రీవారి సముద్రం కట్టపై ఉన్న టూరిజం గెస్ట్ హౌజ్‌లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. దేశంలో సమాచార హక్కు చట్టం సాధించిన ఘనత సీపీఎంకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తే పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. అంతకు ముందు శిక్షణ తరగతులు సందర్భంగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి పర్వతాలు ఎగరవేశారు. కార్యవర్గ సభ్యులు అంజనేయులు, శ్రీనివాసులు, గీత, మండల కార్యదర్శి శివవర్మ, ఈశ్వర్, బాల్‌రెడ్డి, తారాసింగ్ ఉన్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. బుధవారం గుంటిపల్లిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గురువారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని వెల్లడించారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తున్నారని, పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.

